# ఎడమకు తోలండి

క్లీనరు పైడితల్లి రైల్వే ట్రక్కు డ్రైవరు నూకరాజును అడిగేడు.

"గురూ! ఆట ఆకరయేతలికి సినిమాలో గొప్పోడి కూతురుని పేదోడు పెల్లాడేసి ఆడూ గొప్పోడయి పోతాడు గందా! బీదోల్ల నొగ్గికండా ఆల్లతో కలిసీ మెలిసీ సుకం గుంటాడా? నేక ఆడూ గొప్పోల్లతో కలిసి పుటకే మరిసి పోతాడా? తెలిసీ సెప్పకపోయావో నీ తల పగిలిపోతాది" అని శవంలోని భేతాళుడికి మల్లే ప్రశ్నించేడు.

శునకమాలక్ష్మి ప్రోగ్రామ్ మరిసిపోయి నూకరాజు "ఆట ఆకరయేక ఆల్ల కేసైతే ఆ ఊసు నీ కెందుకురా?" అని అనబోయి గురుడికి తెలీని చంగతి ఉండరాదని గురుతుకొచ్చి డైనమోలో పడ్డాడు.

పైడితల్లి మహాగ్యాని! గ్యానికుండవలిసిన లచ్చణాలన్నీ ఉన్నాయి. మునుపు కుండల్లోంచి, సెవుల్లోంచి పుట్టుకొత్తే, పైడితల్లిగాడు విశాకపట్నం బస్సు స్టాండులో పుట్టేడు. ఆ యాస్రిమగలో, చినీమాలో చెకుంతల జింకలతో లేళ్ళతో

ఆడుకున్నట్టు, ఆడు రంగు రంగుల బస్సులతో ఆడుకునేవోడు. బస్సుస్టాండులో అడుక్కునే ముష్టిది ఆడికింత గంజిపోసి, తన బిడ్డలతోపాటు సాకింది. ఆ ముష్టిదాని గుండెల్లో పొంగిన దయ ఆడిని అందులో ముంచెత్తేసింది. పైడితల్లిగాడు పెంటదిబ్బల మీద ఆడుకున్నాడు. కుళ్ళుకాలవల్లో దిగేడు. చెత్తడబ్బాల్లో కూకుడున్నాడు. ఆ తల్లి తన సేత్తో పెట్టిన కూడు తిన్నాడు. ఆకులు నమిలేడు. నీళ్ళు తాగేడు. ఆ యమ్మ తన బిడ్డలకు దొంగతనం సెయ్యద్దని సెప్పింది. అడుక్కు తినమనేది. బస్సుస్టాండులో దొంగతనాలు సేసినోళ్ళని సితకబొడవటం తను నూసేడు. పైడితల్లికి అడుక్కోవటం నేర్పింది. దయగా ఉండమంది. నీతిగా బతకమంది. మరి ఆడు గ్యానికాక మరేటవుతాడు? ముష్టితల్లి గుండెల్లో తరగని దయ, బస్సుస్టాండు మురికిలోపుట్టి పెరిగిన పైడితల్లి బుర్రలో గ్యానం రెండూ ఎలా గొచ్చాయో ఎవుడన్నా సెప్పగలడా? గొప్పోరు నీచంగా ఆలోచిస్తా ఉన్నాడు. నీచపోడు గొప్ప ఆలోసెన్లు సేస్తా వున్నాడు. వారెవా, సిత్రం సిత్రం, మహాసిత్రం లాగుంది.

పైడితల్లి బస్సుస్టాండులో బస్సుల్ని తుడిచీవోడు. బస్సుల్ని కడిగీవోడు. దుకాణపోళ్ళకి సిన్న సిన్న పనులు సేసిపెట్టీవోడు, కాణీ, పరకా, అర్ధణా, అణా, బేడా, పావలా సంపాదించీవోడు. వీరులు దేశమాతకి తమతమ పేణాలు సులాగ్గా ఇచ్చినట్టు ముష్టితల్లికి ఆ సొమ్ములు పట్టిగెల్లి ఇచ్చీవోడు. ఆ డబ్బుల్తో ఆ ముష్టిది జంతికల కుర్రాడికి, బఠాణీల కుర్రాడికి

అన్న వొండిపెట్టి డబ్బులు సంపారించేడి. పైడితల్లి దృష్టిలో ఆ ముష్టితల్లి బస్సుస్టాండుకి భరతమాత. మూటలుమోసే గుంటడు, ముస్టెత్తుకునే గుంటెదవలు, కండక్టరులు, డెయివోర్లతో సరసాలాడేందుకొచ్చే పోకిరీలంజెలు, రిచ్చావోళ్ళు, పళ్ళమ్ముకునేవోళ్ళు, పూలమ్ముకువేలోళ్ళు, ఆళ్ళ తగూలాటలు, కొట్లాటలు—రోజురోజంతా ఈ గొడవ పెపంచంలో గడిసిపోతుంది. అద్గదే బతుకు! అల్లదే పసువు! అదే బడి! ఆ బస్సుస్టాండు ముసలి వస్తాదులాగుంది. వానాకాలం అది ఊసుకునే పీకిదానులా గుంటాది నమ్మండి అక్కడ కూడా సెందురుడు ఎన్నెలనీ యిరగ కాపించేడు. ఆ పెంటకుప్పలమీద కూడా సూర్నారాయణమూర్తి సురసురా సూసేడు. అల్లక్కడా వానలు కురిసేయి, వెలిసేయి. ఆ సుట్టూ తడికల మీద సినిమా కాయితాలు, బొమ్మల కాయితాలు అంటెంపించేరు. ఆ బొమ్మల్లో మడుసులంతా ఎంతో బావుంటారు. ఆల్లంతా తమల్ని నవ్వుతూ పలకరిత్తా ఉంటారు. పైడితల్లిగాడు ఇల్లిక్కడే ఉదయించేడు.

ఆ బస్సుస్టాండులో ఓ సినిమాబొమ్మల కాయితం కింద టీ దుకాణాని కెదురుగ్గా నూకరాజు ట్రక్కు డెయివోరు పైడితల్లిని కలిసేడు. అల్లక్కడే అసుంటా టీ దుకాణం ఎనక జంతికల సాయిత్రిని కలిసేడు. ముందొస్తే నూకరాజు జంతికల ముసలమ్మను సాయిత్రిని గురించి వాకబు సేసేవోడు. సాయి

త్తిరి ముందొస్తే "జంతికలు" అంటూ నూకరాజుకోసం కాసేది. "చల్ మోహనరంగా" అని రిక్షా ఎక్కి సినిమాకి పోయేనారు జంటగా. జంతికల సాయిత్తిరీ మోజులో టీ దుకాణముకాడ డ్రెయివోరు లవిసెన్ను పారేసుగున్నాడు నూకరాజు, ఆ లవిసెన్ను పైడితల్లి పైకి రావటానికి లచ్చరూపాయల లాటరీ టిక్కెట్టులా పనిచేసింది. ఆడుదాన్ని కరకట్టుగా జంతికల సాయిత్తిరి నూకరాజుని ఏడిపించి ఏడిపించి మరీ ఇచ్చింది ఇచ్చినపుడు సొమ్ము లడగలేదు. కోకలడగలేదు. కైకలా రెండు వరాలు- రెండే- కోరింది. పైడితల్లికి ట్రక్కు క్లీనరు ఉజ్జోగం ఏపించి, తన్ను అన్నారం కొండమీదకు తీసికెళ్ళి పెల్లాడ్డం నూకరాజు మొదటిది అపల్రైటుగా చేసాడు. పెల్లాడ్డం "దానికేంలే నూడ్దాం" అన్నాడు. "మరిగంతే, పెళ్లాడితే సుంకం నేదే" అని నవ్వాడు. "గుండెలో ఏదో గుబులవుతది మావా!" నా కల్లలోన కల్లుపెట్టి నూడకు, మావా!" అని గుసిసింది. "గలాసడు మంచినీల్ళు తాగే పోద్ది" అన్నాడు.

అల్లా నిచ్చెన మీంచి మెల్లెక్కి పైకొచ్చాడు పైడితల్లి. రయిల్వే, ఆడికి రోజురోజుకి రెండు రూపాయలిచ్చి, రెండు రూపాయలు లారీలో తిరిగినందుకు బేటా యిస్తావుంది. అదట్టెగెల్లి ఆడు జంతికల సాయిత్తిరి కూరల దుకాణంలో మదుపెట్టేడు గుకుడికి దండంపెట్టి స్టీరింగు చక్రం పట్టిన పైడితల్లికి, జంతికల సాయిత్తిరి భుజంమీద సెయ్యేసి ఒక చేతితో స్టీరింగుచక్రం పట్టుకున్న నూకరాజు సాక్షాత్తు విష్ణుమూర్తిలా

దరిసెనమిచ్చేడు. అంచేత శ్రీరామచందురుని హనుమంతుడిలా పైడితల్లి నూకరాజుని కొలిచేడు. కాని హనుమంతుడు కూడా శ్రీరామునితో యుద్ధం చేసేడు. అర్జునుడు శ్రీకృష్ణునితో పోరాడేడు.

పైడితల్లికి నూకరాజు అర్థంకాలేదు. కిందవాడికి పైవాడు బోధపడనట్టు. వేలకువేలు పోసి కొన్న లారీలను రోజుకు నాలుగు రూపాయలు జీతం, మూడు రూపాయల బేటా ఇచ్చి నూకరాజు చేతిలో పెట్టేసేరు. ఏడాదిలో బండి తుక్కు-తుక్కయిపోవాలి. "ఆడు బండిలో సామానులు దొంగలాడేస్తాడు. ఆయిలు ఎత్తుకుపోయి అమ్మేస్తాడు. ఇంజను పార్టులు ఇప్పి పట్టుకెళ్ళి అమ్ముకునోస్తాడు. సెనంలో ట్యూబులు, టైరులు దొంగతనంగా మార్చేస్తాడు. బ్యాట్రీ మారుస్తాడు. మరి లారీ అంటే "కాళీమాయి" అవతారంగదా! ఆయమ్మ వొంట్లో సెయ్యి పోనిచ్చి దొంగలాడితే ఆయమ్మ ఊరుకుంటుందే!"

ఎల్లమ్మతోటకాడ కిరస్తానీల మూసేసిన స్మశానంకాడ ట్రక్కు ఆపుకుని, బండిలో పడుకుని ఆలోచిస్తా ఉంటే, స్మశానంలో మామిడిచెట్లు కనిపించాయి. ఆ మామిడిచెట్లు ఎందుకో అర్థంకాలేదు. చచ్చిపోయిన వాళ్ళంతా ఎంత పచ్చగా బతికారో ఆ చెట్లు గుర్తుకు తెస్తున్నాయి. పైడితల్లికి సినిమాలు అర్థంకావు చాలా సంగతులు అర్థంకావు. ముఖ్యంగా జీవితం అర్థంకాలేదు. మనుష్యులు అంతకంటె బోధపడకుండా ఉన్నారు

కిందవాడిని పైవాడు పైకి రానివ్వడు. పైవాడితో కిందవాడు సమకొట్టలేడు. నూకరాజుని బండి తోలడానికి పెట్టేరు. పైడి తల్లిని బండి తుడవటానికి పెట్టేరు.

అందుకని ఆడికి బానిస చాకిరీ అంతా చేసేడు. ఆడి ముండలిళ్ళకి కోక లట్టిగెళ్ళి ఇచ్చేడు. సబ్బుబిళ్ళలు యిచ్చేడు. ఆయిలు అమ్మి పెట్టేడు. లారీ ట్రిప్పుట్రిప్పుకీ పాసెంజర్లనిపోగు చేసిపెట్టేడు. గురుడు ఊరికి ఓ త్తిని ఉంచి శృంగారం వెలిగించేడు. కనకమాలక్ష్మిలా రయిల్వే లారీ ఆమకోబట్టికాక, లేపోతే నూకరాజు నూకల్లో కలిసిపోయేవోడు! ఆడి ముండలు బంకల్ని పట్టుకుపోయేవోరు! అలా బానిసలా బ్రతికి స్టీరింగు చక్రం పట్టుగున్నా నూకరాజు "అద్దం తుడిచేవా? బండి మట్టి గొట్టుకు పోనాది. కడిగి ఎన్నాళ్ళయినాది? టూరుపాలిస్సు వోపాలి దులిపి పడెయ్యమంటే మాట ఇనుకోవు. టెంపరు నావయిపోనాది" అని గసిరిసీవోడు. క్లీనరును బండి దిగమని సెప్పి ఆకు ఎక్కేడో లేడో సూసుకుండా బండిని లాగించీసీవోడు.

"గురో! టీ సుక్కలకు డబ్బులు నేవు" అన్నా కానీ రాల్చేడు. టి. ఎ. రాసుగుందుకు లాగుబుక్కు ఇచ్చీవోడు కాదు. తన టి. ఎ. బిల్లు సూకనిచ్చీవోడు కాదు.

గురుడు శృంగారం వెలిగించడానికి ఊళ్ళోకి వెళ్ళినపుడు లారీని కంటికి రెప్పలా కాసీవోడు. తాను మ్యాటినీ సినిమాకు పోతే బండిని లాగేసి, "ఆడు డూటీలోకి రాలే"దని ఆఫీసులో

సెప్పి జీతం కోయించేసేడు. నూకరాజు తన్ని ఉద్యోగస్తుడ్ని చేసేడు. ఆ మాట నిజవేఁ! అందుకు ఆడిని తను బానిసలా కాసేడు. కాని ఆడికి దయలేదు, జాలిలేదు, మనిషిమీద మనిషికుండే మమత లేదు.

నూకరాజు ఊరికి ఓత్తి నుంచేడు. అది తప్పుగా తోచలేదు. ఆడు తమ్ముడు పెళ్లాన్ని తెచ్చేడు. అప్పుడు బూమి బద్దలాసిపోతాదనుకున్నాడు ఆకసం బొక్కడి పోద్దనుకున్నాడు. సంద్రం వచ్చి ఊరుని ముంచేస్తదని అనుకున్నాడు. ఏదీ కాలేదు! ఆశ్చర్యవేఁ? అన్న తమ్ముడిని రచ్చించాల! ఆడు భక్షిస్తన్నాడు! దేవుడు సూస్తా ఊరుకున్నాడు.

ఈ దుఃఖాన్ని పైడితల్లి తనకు కలిగినట్లు భావించి, ఎల్లయ్యమ్మకడ వెళ్ళబోసుకున్నాడు.

ఎల్లయ్యమ్మంటే ఎవరోకాదు, పూర్ణా మార్కెటులో కూరలమ్ముకునే ఆడకూతురే. దానికి సతీ సావిత్రంటే ఇష్టం! "నువ్వు సాయిత్తిరిలా గుంటావే" అన్నాడు నూకరాజు. "అయితే ఆ పేరుతోటే పిలు, మావాఁ!" అంది ఎల్లయ్యమ్మ. పిల్లి ఎల్లయ్యమ్మకు జంతికలు యిష్టం. కూరల తట్టలమీద కూకొని కాళ్ళూపడం చాలా యిష్టం. అప్పుడు "జంతికల సాయిత్తిరీ" అంటే "వోఁ" యని పలుకుతుంది. ఎల్లయ్యమ్మ బొద్దుగా పువ్వుల చెట్టులా కలకల్లాడుతూ ఉంటుంది. మునుపు గుడ్లు తెచ్చి అమ్మేది. కోళ్ళ పెంపకం సాగించింది. బత్తాయి పళ్ళ కాలంలో అది వాడికి మనసిచ్చింది దానికి వాడు

చేయూత యిచ్చేడు. నూకరాజుకు గిరజాల జుట్టుంది. కోర మీసాలున్నాయి. నల్ల కళ్ళద్దాలున్నాయి. మెళ్లో సన్నటి బంగారు గొలుసుంది. ఆడి బుజంమీద ఎర్రంచుల బొమ్మచ తువ్వాల ఉన్నది. గుండెలో ఎడతెగని గుబులున్నది.

జంతికల సాయిత్తిరి పెదాలమీద పాలమీగడలాటి చిరునవ్వున్నది. దాని కళ్ళలో మత్తుమందున్నది. దాని సిగలో సింహాచలం సంపంగి పువ్వున్నది. దాని మనసులో పన్నీటి జల్లున్నది. అది కూరలమధ్య కూర్చుని అమ్ముతుంటే దాని జీవితం ఎంత పచ్చగా ఉన్నదో తెలుస్తున్నది.

నూకరాజు 'కేరేజాట్' గాడు. ఆడు మిల్ట్రీనుంచి వొచ్చేడు ఆడు బర్మాలో రోడ్లన్నీ పరిగెత్తేడు. రాతిరీ, పవలూ, ఎన్నెట్లో, సీకట్లో, ఎండల్లో, వానల్లో ఎర్రికుక్కలా రోడ్లంట పరిగెత్తడవే ఆడి జీవితం! నూకరాజుకి రేపు నిజం కాదు ఈ సెణవే నిజం! బెంగాలు కరువులో శవాల మధ్య నుంచి బళ్ళు తోలేడు. "మనుషులు పొట్టకోసం ఏ పనైనా సేస్తారు. అది తప్పుకాదు. ఒరే! ఈ పెపంచంలో నేయం, అన్నేయం అని రెండు లేవు. లాభవూ, నష్టవే ఉంది. ఎవడి నేయం వాడిది. బలవంతుడి నాయం బలహీనుడి నాయాన్ని తొక్కేస్తాది. కనక బతకాలంటే జిత్తులన్నీ తెలుసుకుని బతకాల!" అంటాడు.

అందుకని నూకరాజు కుక్కలా పరిగెత్తేడు, నక్కలా బతికేడు. ఆడు యుద్ధాలు చూసేడు. "యుద్ధంలో నేయవేటి

అన్నేయ వేంటి? శవాలకు మిల్ట్రీ గుడ్డలు ఊడలాగేస్తే ఈడు శత్రువు, ఈడు మనోడని ఎవుడు సెప్పగలడు? శత్రువు ఆడి దేశంకోసం సస్తే మనం మన దేశంకోసం సస్తున్నాం. ఆడి దేశానికి ఆడు పేణాలిస్తే మన దేశానికి మనం పేణాలిస్తాం. ఆడూ దేశబత్తుడే, మనవూం దేశ బత్తులవేం! మిల్టరీవోడు యుద్ధంలో సస్తా ఉంటే, ఆడి పెల్లాం బిడ్డలకు, చుట్టాలకు బియ్యం, పంచదార, కిరసనాయిలు బ్లాకులో అమ్మేరు. ఆడు ఎవుళ్ళని రచ్చిస్తన్నాడు తన టుపాకీతో...దొంగల్ని రచ్చిస్తా ఉన్నాడు. పేదోళ్ళని కడుపుకొట్టి లాభాలు గడించే బొజ్జబాబులను, ఆళ్ళ కారులను, ఆళ్ళ ఫాక్టరీలను కాపాడతా ఉన్నాడు. కూడు గోడు, నోరూ వాయీ లేని మడుసుల్ని ధరలు పెంచేసి సావుకార్లు సంపేస్తా ఉన్నారు. కోర్టుల్లో పేదోడికో నాయం, పెద్దోడికో నాయం. పెద్ద దొంగతనాలు సేసినోళ్లు గరానాగా బతుకుతున్నారు. సిన్న సిన్న దొంగతనాలు సేసినోళ్ళు జైళ్ళలో మగ్గుతున్నారు. దొంగతనవంటే కన్నవేసి దొంగతనం సెయ్యడవనేనా? మాయసేసి మానపాణాలు నాగేస్తా ఉన్నారు. దేశవంటే మట్టిని రచ్చించడ వేంటి? మడుసుల్ని రచ్చించాల. మడుసుల్ని దోచుకునేవోళ్ళకే అపాయం రాకుండా పోలీసులు, జైళ్ళు, కోరుట్లు, ఎదవా! ఎదవన్నర ఎదవా! పేదోడు గొప్పోడవడమెట్టా? ఆడు డబ్బులు నొల్లుకోడానికి సినీమా తీస్తాఉన్నాడు. ఆడు సినీమాలో సూపించిన పేదనంజె ఎంత సోగ్గుంటాది? జిలుగు బట్టలేస్తాది. ఆడతాది,

పాడతాది. అది మాయ లోకంరా....ఆ ఈరోగాడు "నేను పెజల మడిసిని నేను మీ ఎంటే ఉంటాను" అని గుండె బాదుకుని సెప్తాడు ఆడి ఇంటికెల్లి సూడు-కుక్క బొయ్యిమంటాది. గేటుకాడ గూర్కా వోడు - వొరే పైడితల్లీ. మహాగ్యానీ, నీకు రెండు తగలసిస్తాడు సినీమావోడి నీతులు, గవర్నమెంటోడి నీతులు పాలల్లా తెల్లగా అల్లానే ఉంటాయిరా! నివ్వు అమాయకవు నంజెకొడుకువి గనక పేదోడు గొప్పోడి కూతుర్ని పెల్లాడేసి, బీదోల్ల నొగ్గికుండా ఆల్లతో కలిసి సుకంగుంటాడంటే నమ్మేసేవు! నివ్వు సినీమాలు సూసేదెందుకురా? మనసు సల్లబడటానికి. ఆటా పాటా సూస్తే 'హాయి' గుంటాదని. హాలువోడు సినీమా ఎందుకేస్తా ఉన్నాడు? డబ్బులు వొడకటానికి. నివ్వు నీ కస్టం కూంతసేపు మరిసిపోవాల? ఆ కూంతసేపు సొరగంలో ఉన్నట్టు గుండాల? ఆల్లెంత అందంగుంటారు? ఆల్లెంత మంచి బట్టలేసుకుంటారు? ఆళ్ళు నీ మనసు మాయసేసి నీ పావలా డబ్బులకోసం నక్కల్లా కాసుగూసున్నారు. నిన్ను నవ్విస్తారు. నిన్నేడిపిస్తారు పొలాల్లో వరి మానేసి పుగాకు పండిస్తా ఉన్నారు. నా పొలం, నా యిష్టం అని పెద్ద రైతు గవుర్నమెంటోడి మూతిమీద కొడతాఉన్నాడు. తిండి గింజలు పండిస్తే తక్కువ లాబం, పుగాకు వేస్తే ఎక్కువలాబం వస్తుంది. కనుక ఎక్కువ లాబం వచ్చే పనే సేస్తున్నాడు మోతుబరి. నివ్వు ఎడమకు తోలకపోతే నిన్ను పోలీసోడు లటుక్కున పట్టుగుంటాడు. ఆడు బియ్యపు గింజలు పండించకపోతే,

ఆడి పొలాన్ని ఆడు దున్నకుండా వదిలేస్తే పోలీసోడు ఆణ్ణే వన్నా సేయగల్డా? పుగాకులో నాభాలొస్తే ఆడట్టిగెళ్ళి మెడ్రాసులో సినీమాలో ఎడతాడు. సినీమావోడు పెజలకోసం బొట బొటా కన్నీరు కారుస్తాడు. నాను సెబుతున్నాను. మిలట్రీలో తిరిగొచ్చి వోణ్ణి. నాలుగుకోడ్లు తిరిగాను. నానా దేశాలు చూసాను. ఏనుగుల మద్దెన బతికేను. ఏనుగుల్ని తప్పించుకు తిరిగేను. ఇనకోరా పైడితల్లీ! మహాగ్యానివి ... సినీమాలో ఈరో గొప్పోడి కూతుర్ని పెల్లాడితే ఈరోగాడికే నష్టం. మనతో ఆడు కలిసి బతకనేడు, ఆల్లు ఆడిని కలిసి బతకనియ్యరు" అని బండిని ఆపుచేసి, "శునకం సోడా కొట్టే" అని కేక పెట్టేడు.

దాని అసలు పేరు కనకం. దానికో ఆడ కిల్లీకొట్టు దొండపర్తిలో ఉన్నాది. అక్కడ మనోడు సిన్న కాతా ఓపెన్ సేసేడు. అక్కడ అమృతం నరులకు పంచిపెడుతుంది జగన్మోహిని అపరావతారమైన కనకమహాలక్ష్మి.

శునకమాలక్ష్మి సురసురా సూసింది. "ఎవుడాడు?" అని ఎండకు సేతు లడ్డంపెట్టి. "డంబువోరుగారా? దండాలు! దండాలు! మావోళ్ళు నలుగురున్నారు—యస్కోట తీసికెళ్లాలి"

"కానీ."

"మాపిటికి మావాఁ!"

“ఓ యస్ ఆవిల్ రైటు.”

రాత్రికి లారీ పైడితల్లివంతు తేవటం. శునకమాలక్ష్మి మనుషులు లారీని సీసాలతో లోడు సేస్తా ఉన్నారు. ఆ లారీలో ఇంకా సామానులు ముందే లోడు సేసారు. పిలిసర్లున్నాయి. గురుడు యస్కోటలో వచ్చి కలుస్తానన్నాడు రాందాసుతో.

మామిడితోటలో ఆ ఎనక తాటిచెట్లపాలెంలో ఓ పాక ఉన్నది. అందులో నులకమంచంలో శునకమాలక్ష్మిని వాటేసుకుని, నులక రాజులా నూకరాజు తొంగున్నాడు. ఆ రాత్రి తాటిచెట్టును మబ్బులు కమ్మేయి, శునకరాజు నులక మాలక్ష్మితో సుకంగుండగా, చూరుకెవరో నిప్పంటిచేరు. నిప్పు లేందే పొగరాదు కదా!

ఆ రాత్రే నూకరాజు చెప్పినట్లు, తుచ తప్పకుండా ఇసాకపట్నంనుంచి ఇజానగరంమీదుగా యస్కోటకు లారీ నడిపించుకు వెళుతున్నాడు. పైడితల్లి. తన బతుకును తిట్టుగుంటూ, లారీలో పన్నెండుమంది ప్యాసింజర్లున్నారు. సారా పీపాలున్నాయి. సిలివర్లు, సీబులు, సట్టులు బోట్లులు అంతా ఇనపమాలచ్చిమి. పైడి[illegible] ఒణికిపోతున్నాడు.

“సింవాద్రి అప్పన్నా! అన్నవరం సెత్తినారాయణ మూర్తీ! రచ్చించు! రచ్చించు! నానే పాపం ఎరగను. నాను సారా ముట్టను. నాకు దొంగలాట్టం గిట్టదు. కాని నా సేత కానిపనులు సేయిస్తన్నాడు గురుడు. సర్కారు లారీని రూటు

తప్పిస్తే డొక్కలో పొడవరా! బగమంతుడా నాకు తెలీకడుగు తాను—ఇన్ని తప్పులు సేసినోడు నూకరాజు ఎలక్ట్రిక్ బల్బులా ఎలిగిపోతున్నాడు. ఏవీ తప్పులు సెయ్యనోడిని, ఆడి ముండల కాసినాను కన్నెత్తి సూడనేదని. కాని ఎలకలా మాడిసస్తా వున్నాను. సినుకులు! సినుకులు! శివశివా! గురుడికి వాపీవరసా లేకుండా వున్నాది. ఆడి గుండెదయిర్నం స్టెప్నీసి మార్చేసి నాడు. అన్నా! మిల్ట్రీవోడు, మిల్ట్రీవోడనిపించుకున్నాడు. ఆకు కేరేజాట్ గాడు. ఇదేటి...అమ్మబాబోయి—స్టీరింగు తెగిపోనాది. బండి దిగిపోతున్నాది. ఓరి నాయనోయ్! దూకే స్తాను. అదేమిటది—పెద్ద రాక్షసి—బాబోయ్— దూకు తున్నాను. బతికుంటే బలుసాకు తినచ్చుగందా!"

జంతికల సాయిత్రిరి ఉడుకు నీళ్ళోసుకుని, నెనిలాన్ కోకగట్టి, జుట్టుముడి బిగించి. తలనిండా సింహాచలం సంపంగి పూలెట్టుకుని గుమ్మంకాడ కాసి కాసి నూకరాజు జాడ తెలి యక పేనం విసిగి, ఉసూరుమంటూ రొండో ఆట సినిమాకెల్లి వచ్చి కళ్లు నులుముకుంటూ పండుకుంది. తెల్లారేముందు మట్టి గొట్టుకుపోయి, మతి చెడిపోయిన పైడితల్లి "ఎల్లమ్మా! ఎల్ల య్యమ్మా! నన్ను రచ్చించే, కాపాడే" అని తలుపు తట్టాడు. జంతికల సాయిత్రిరి తలుపుతీసి ఆడికో కాపు కాసేసింది.

మర్నాడు ఉదయ—

శునకమాలక్ష్మి ఆడ కిళ్ళీకొట్టు సంతాపసూచకంగా

కాక శాశ్వతంగా మూయబడింది జంతికల సాయిత్రిరి స్త్రీ హృదయంలో ఎంతోమందికి చోటుంది, అని ఋజువు చేసు కుందుకు పైడితల్లికి చోటిచ్చింది. ఆడు గొప్పోడి కూతురిని పేదోడు పెళ్లాడేసి —అన్న డవుటు అడగటం మానీసేడు. ఆ రోజు ఉదయం ఇజానగరం ఎస్కోట రోడ్డులో ఓ నారీ చెట్టును గుద్దేసి రోడ్డుమీద మరణించింది. అందులోంచి ఆరు సారాపీపాలు పడి ఒలికిపోయి అందులో మొండేల్ని నెత్తురినీ కలగా పులగం చేసేయి, డ్రయివరు, క్లీనరు సనిపోయినట్లుగా భావించబడుతున్నారు. ఆ లారీ అనుమానాస్పదమైనచోట రూటుకాని రూటులో మరణించడంవల్ల, డ్రయివరు, క్లీనరు సనిపోయినట్లు భావించబడుతూండటంవల్ల పోలీసు యినస్పెక్టరు ఫలానా (ట్రాన్స్‌ఫరుమీద వచ్చారు కొత్తగా) రిజిష్టరు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బ్రేకు ఇనస్పెక్టరు వచ్చి "బళ్ళను ఎడమకు తోలుడు" అన్న రూలును అతిక్రమించటంవల్లకూడా ప్రమాదం జరిగి వుండవచ్చని నొక్కి చెప్పారు. కనక బండ్లను మనుష్యులను, మతాల్నీ, జాతుల్నీ దేవుణ్ణీ అందర్నీ ఎడమకు తోలుడు!

★